కథానిక

# ప్రేమ పోకడలు

కార్యంపూడి కృష్ణమూర్తి

వూర్లో కిట్టే పాకి పోనా దా వూసు. ఇంకేం వుండ దా పాట్న ఎగబడ్డరు జనమంతా. సిన్నోల్లు, పెద్దోల్లు, ఆడోల్లు, మొగోల్లూ... ఒకరేంటి యావనమంది వత్తుండరు మర్రి సెట్టు కాడికి.

పైడెమ్మ బాయిలో పడి సచ్చి బిడ్డలమీన బెమ తీరక దెయ్యమై ఆ సెట్టుమీనే వుండది యిరవై యేల్ల మట్టి. ఆనాటి కాణ్ణుంచి యీ యాల్దాకా ఆ సెట్టుమొగం సూసినోల్లు లేరుగా. సీతాయి గెడ్డి క సెల్లి యాద మరిసి ఆటుకేసి యెల్లిందంట. ఆపాట్న పైడెమ్మ దెయ్యం దాన్నిపట్టి ఎంతసేసినా వదన్నేదు గందా ఆర్నెల్లుదాకా. పాపం! ఏనుగసుమంటి మడిసి పీనిగై కూకుండది సీతాయి. పెదకాపు గోరి పాలై ముత్తాయి గోడి కొడుకు గొడ్డుమేపు కుంటా అటెల్లిండంట. ఇం కేంవుండది ఆరాత్తిరి కారాత్తిరి యెర్రి కాకేసి నిలువునా సచ్చిండు. జుము లేకి మడిసి. వుక్కుముక్కులా గుంటడు. మరదంత లావోంటి దెయ్యం.

జానానికి దెయ్యంమాటే పొడకట్టనేదు. ఆస లా యిసయం మరిసిపో నట్టున్నరు. నేకపోతే సెత్తురు గుడ్డు ల్లేసుకుని ఆ మర్రిసెట్టుకాడి కొత్తరా?

జనం కిటకిట లాడ్తుండరు. 'ఓరి కూసోం డ'శని, 'ఆయనగోర్ని కాత్త వూపిరి తీసుకో నియ్యండ' హెని, 'మీరు దేని కొచ్చిర్రురా! అయ్యగోర్ని సూసేందుకా, ఆడక్కు తినేందు' కాని పెద్దోల్లు అల్లరి సేసేవోల్లని కేకలేత్తుం డరు. ఆడోల్లదే మరీ యిద్దూరం. ఆయనమీనకి మరీమరీ తోసుకొత్తుండరు. ఆ మాటంటే అల్లు సీలిగి సచ్చిర్రు. 'ఆడోల్లంటే అంత అలకనగా వుండదిగా! అంతా అనేవోల్లేనా?' అని కూని రాగాలు తీసిర్రు. పిల్లోల్లు ఆ చంగతే అనుకో కుండా ఆకడా యీకడా ఆడుకుంటుండరు.

ఎప్పుడొచ్చిండో యేమో తెల్లారే పాటికల్లా సోములోరు మర్రిసెట్టుకింద జపంసేసు కుంటుండడు. పొద్దుటాలమట్టి మూసిన కన్ను మూసినట్టుగనే వుండవి. తపుసు పట్టిండు. ఎప్పుడు కల్లు తెరుత్తుడాని యెదురు సూత్తుండరు.

సోములోరు బాగా వొడెత్తు మడిసి. గెడ్డం బొడ్డుదాకా పెరిగుండది. మొగాన గెందబొట్టు పెట్టిండు. సెవులుకి నాగు పాము లంటి యేంటో అయ్యి పెట్టుకున్నడు. మెడనిండా దండలే. సానారకాల దండలు. ఓ ఎంతోటి పెద్ద జుత్తు, జడలు కట్టక పోయిండది. కూకుంటానికి పుల్తోలు. అదేంటది... సన్నాసోల్లు నీల్లు పోసుకుంటరె, అద్గది. సాచ్చాత్తు సాంబసివు డున్నట్టున్నడు సోములోరు.

పొద్దు కర కర బాగా అంతెక్కుంటది. ఇంతట్లో సోములోరు కల్లు తెరిసిండు. యిక నేం వుండది, యెక్కడి జన మక్కణ్ణే సర్దుకుని కూకుండరు. అందర్నీ యెగా దిగా సూసిండు. రెండుసార్లు సెయ్యూపి గాన మారగం బోదించిండు.

"యీ పెపంచికంలో యిరవై నాలుగు లచ్చల జీవరాసు లుండై. యీటన్నింటి కాడికి మడిసి జల్మ దొడ్డది. యెందుకనంటే మానువుడికి మంచేంటో, చెడ్డేంటి దని తెల్చుకుండేందుకు గానం వుండది. తక్కిన జీవాలకి మంచీ చెడ్డా యేం తెలుత్తవి. సూత్తుండాంగా ఆవులు గేదెలు పేళ్లోని పొల్లాడుతుంటై. పందిపిల్ల సూర్రాదూ, దానత్తసుదియ్యా!... ఆటికేం తెల్దు. అందుకని మనమన్నిటి కాడికి మంచిజల్మ యెత్తిందానికి దరమంగా బతకాలి. పెల్లమని, బిడ్డని, యిల్లని, వాకిలని బెమత పెట్టుకోకుండా ఆపరాత్తుణ్ణి నమ్ముకుంటే పున్నె మొత్తవి. ఈ పెళ్ళము, పిల్లలు రేపు సత్తే ఏమైపోతరు? మనెంటొత్తరా? ఏందో అంతా మాయ. మనం సేసుకుండ పాపం

పున్నెం రెండేమనం సచ్చినానిక యీ భూమ్మీన వుండిపోతై.' మా గొప్పగా సెప్పిండు సోములోరు. "సాయిత్తరం బజినసేత్తం. అంతా తప్పరాండి. నాకు తానానికి యాళైంది" అంటానే సోములో రెల్లిపోయిండు.

అల్లంత పొద్దుండా దనగా వూర్లో సిన్నా పెద్దా సోములోరికాడికి చేరిన్రు, తలో వొక్కాయ పొందు సోములోరి కిచ్చిన్రు. అయన్నీ కలిపి సోములోరు పలారం పెట్టించిండు. సోములోరి యెంగిలి తింటే పున్నెమొత్తదంట... పున్నెం. ఒక్క యదవకన్నా బుద్ది నేదు. పలారమైపోనానక సోములో రందరిసేతా బజిన్సేయించిండు. బజినైపోనానాక అందరికీ యీబూది పెట్టిండు. అబ్బో! పిల్లలేనోల్లకి పిల్లలు పుడతరంట, రోగం రొప్పి వున్నోల్లకి నయమౌతాదంట, యింగా మనుసులో ఏదేనా కోరిగ్గానుంటే నెరవేరతదంట. యేడిసారు యెదవలు. ఒకడు కామోతే ఒకడన్నా యిందులో సత్తె మెంతుండాదని ఆలోచిచ్చడే. ఎద్దినతుండదీ అంటే కాట కట్టమంటమే. పుడతారంటే పుడతరు, నయమౌతాయంటే నయమౌతాయి. యింతే యీల్లకి తెల్సిందల్లా. యీబూదంతా పెట్టించుకున్నరు. కాని రత్తి మాత్తరం సోములోరికాడికి పోలా. సోములోర్ని అదేపనిగా సూత్తుండాది.

సోములోరు మల్లీ గానబోద సేసిండు. "మనం బూమ్మీద మడుసులమై పుట్టినందుకు యితరోల్లకి చాతనైనంత సాయం సేయాల. యెదాల్లో యేవుండాదంటే తోటోల్లకి సాయంసేత్తే దేముడు మనకు సాయం సేత్తడు. దేముడు మనకీ శరీల మెందు కిచ్చిండంటే యితరోల్లకి సాయం సేసేదానికే. ఈ జల్మ తరిచ్చటానికి కెలియుగంలో యిదోటే మంచి మారగం. దాంచేత ఎంతకీ మనవల్ల యితరోల్ల మనసు కట్టంపడకుండా సూసుకోవాలి. ఆడోల్లు గాని మొగోల్లుగాని మన్నేదన్నా కోరి కోర్కరు కుంటే యెంటనే తీరుత్తుండాలి. నేకపోతే ఆల్లమనుసు కట్టంపడుద్ది. మన మూలాన యితరోల్ల మనసు కట్టం పడితే మనికి నరకం తప్పదు." మా గొప్పగా తెలిసినోడు సోములోరు. గానబోద సేసినానిక కడుపునిండా పల్లా, పాలూ ఎక్కించి నిదరపోయిండు. వూర్లో జనమంతా యేరింటి కారు యెల్లి పోయిన్రు. "ఒరే! సూత్తే యీడు మన యెంకటాయిగోడి యెంకట్రావోలే వుండడే" మని సనిగిన్రు కొంత మంది.

పదిహేనేల్లనాడు వూరొదిలి యెల్లిన యెంకట్రావు రుసిగా మల్లీ వచ్చిండంటే యేరు నమ్మతరు, యేరూ నమ్మనేదు.

* * *

యాడికో లేసిపోతుండది. అమ్మ దొంగా! ఇంతకాలంగా నేను గమనిచ్చనేదు. నాపక్క పండుకోని నాకు తెలకుండా యిట్టా ఎన్నాల్లబట్టి సేత్తుండాదో యేమో! ఆడదాని మనుసు తెల్సుకోటానికి బెమ్మదేముడికూడా తరం కాదు. యీరోజైనా దీని అంతేందో తేల్సుకోవాల్సిందే.

సల్లగా వూరు దాటి పోతుండది. నేనూ దాని నెనకాతలే సెట్లసాటుగా పిల్లాలే పోతుండను. యెల్లియెల్లి అది మర్రిసెట్టుకాడ ఆగింది. దీని కెంత దెయిర్యం! యింత రాత్తిరికాడ ఒకతే యింతదూరం వొచ్చిండదే! సెట్ల సాటునుండి సూత్తుండను యేంటి జరగతదాని.

సోములోరు గురకపెట్టి నిదరపోతుండడు. 'బావా! బావా!' అంటూ తట్టిలేపింది సోములోర్ని. సోములోరు అదిరిపడి లేచిండు. కాసింత సేపు యేరూ మాటాడకూరుకున్నరు.

"యేరు నువ్వు?" సోములో రడిగిండు.

"నేను బావా నేను—అలివేలు సెల్లిల్ని రత్తిని" సెప్పింది.

"నువ్వా రత్తీ! నన్ను గురుతుపట్టినవే! మీ యక్క బాగుండాదంటే? అంతమందిలో దాని కోసం యెగాదిగా సూసినను. అది కనిపిచ్చనేదు. యీంటగాక రాలేదేమో నేనొచ్చిన్నని సెప్పు" అన్నడు.

"ఇంకే దక్క బావా! అడి కేమ నిచ్చిన్రో దాని మనుసంత నీమీనేగా. ఆడుదాన్ని పాపం! దేవతని కొలిసినట్టు కొలుసుకున్నడు. యెట్టుంటే మటుకేం పెయోజనం? దాని దెమతంతా నీమీనే వుండె. నువ్వొత్తవేమో నని సానా కాలం సూసింది. కడాకి నువ్వు రావనుకోని గుండె

రాయిసేసికోని బాయిలోపడి సచ్చిందిగా బావా" అంటూ రత్తి యేడిసింది.

"అట్టగంటే రత్తీ? అది నన్నెంతగా పేమించిందనుకున్నవు. దాన్ని నేం గోడా మా లావుగా పేమించినా. మీ యమ్మ, నాన దాన్ని బలవొంతంగా సుబ్బడి కిచ్చి సేసిన్రు. ఇంక లాబం లేదనుకుని, మనుసు సీకాకుపుట్టి, దేశంమీన పడి పోనాను. మనుసులో వున్నా పేమేడకి పొద్దే రత్తీ? అది నా కల్లలో తిరుగుతుంటాది. ఎంత కాలమని అట్టుంటను. చూసన్నాపోతమని యీ యాస పేసుకుని యిట్టా వచ్చినను. నా దురదుట్టం, దాన్ని సూసేందుకూ్కడా లేకుండా పోనాది" అంటూ కంటెంబటి నీరెట్టుకున్నడు.

మల్లీ కూత్తిసే పేకూ మాట్టాదనేదు. అనక-

"సూడు బావా! నన్ను సూత్తే మక్కను సూసినట్టుగుండదా బావా!" అన్నది రత్తి.

"అయితే నీకింకా పెళ్ళికాలేదంటే రత్తీ!" అడిగిండు.

"కాకేం బావా! కామయ్య కిచ్చి సేసిన్రు" సెప్పింది.

"మరి కామడు నిన్ను సరిగా యేలుకోకుంటే?" అన్నడు.

"యేలుకోకే బావా; నేనంటే పడిసత్తడు. నేనెంత సెబితే అంతే పాపం: సానా మంచోడు." మెచ్చుకున్నది.

"మరి?" అన్నడు. అట్టాంటి మొగు డుంటే నీకెందుగ్గా పుట్టినాయే యిసుమంటి నడమంతరపు బుద్దు లన్నట్టుగుండా దామాట. మారాజు మంచోడు.

"అదేందో బావా! అక్కకి నీ మీనున్న పేమత సూసినాల బట్టి మనుసంతా నీమీనే బావా! నీతో కలిసున్నట్టుగా, యిద్దరం యేక సెకా లాడుకున్నట్టుగా నువ్వు నన్ను తన్నినట్టుగా, రాత్తిరైనానక నువ్వు నాకాడి కొత్తే నా కోపమంతా మాయిమైపోయి నిన్ను అమాంతంగా ముద్దుపెట్టుకున్నట్టుగా తలుసుకుంటుండే దాన్ని. అసుమంటప్పుడు నావోల్లు నాకు తెల్దు ...అక్క పోనేపోయింది. అక్కకిమారుగా నన్నేలుకో బావా." అని బతిమాలు కుంటుందది. ఆపాట్న దాన్ని ముక్కల్ముక్కల్గా నరుకుదమనిపించింది.

ఒక్క సెనంలో ఆడి సందిట్లో రత్తి! నాకు వొల్లు మండింది. పిడికిలి బిగించి ఆడిమీనకి దూకినా. ఎం సెప్పను, ఆళ్ళిద్దరు కల్చి నన్ను సావసితక తన్నిన్రు. నోట్లో గుడ్డలు కుక్కిన్రు. ఆపాట ఎటు పోయినోరో పోయిన్రు.

దైవసాక్షిగా దాన్ని నా పాణంతో సమానంగ సూసుకున్నను. ఆబద్ద మెందుకు, అదిగోడా నాతో బాగా కల్చి మెల్చుంటుండేది. తన పాణమంతా నామీనే వుండేది. అట్టాంటి దానికే యిట్టాంటి సెడుబుద్దులు పుట్టినాయి. ఏందో బాబూ! పేమంటరు పేమ. ఏం పేమ పాడుపేమ. పేమకి ఒక నిలుపు నిలకడా వుంటేనా?

---

మనం ప్రపంచం ముందుకు వెళ్ళినా వెనక్కు వెళ్ళినాకూడా ఏడిచే పరిస్థితుల్లోనే వున్నాం - దీనికి కారణం - ఈ రెండు పద్ధతులలోనూ వుండే కష్టనిష్ఠూరాలు మనకి అర్థమై ఏడిచాయనికాదు – అర్థం కాకపోవడమే. ఈ అర్థంకాని పరిస్థితులలో, మన బుర్రలో పిండి సత్తువ బాగా కనిపెట్టి, "మేసెస్" అనబడే మనల్ని - ప్రజాసామాన్యాన్ని - ఎటుపడితే అటు తిప్పవచ్చుననేభావం ప్రబలి, పైన చెప్పిన వర్గాలవారంతా చేస్తూండే ప్రచారంకూడా యీ - మన ఏడుపుకి ఒక కారణం.—(శ్రీ)